సాక్షి వనపర్తి

బుధవారం, 18, సెప్టెంబర్, 2024

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /21.3

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.



జిల్లా ప్రగతి నివేదిక చదివి వినిపిస్తున్న ఎన్.ప్రీతమ్

జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎన్.ప్రీతమ్, పక్కన ఎంపీ మల్లురవి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

న్యూస్‌రీల్

ఖాళీ సీట్లు భర్తీ చేయాలి

వనపర్తి: జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ మల్లురవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి దిశా సమావేశం కోసం ముందస్తుగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనం, విద్య తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ సీట్లను వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ధరణిలో తీసుకువచ్చే నూతన మోడ్యూళ్లపై చర్చించారు. సక్సేషన్, మ్యూటేశన్, ఇతరత్ర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎవరైనా ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తులు ఇస్తే తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ జిల్లాకు రైల్వే లైన్, జాతీయ రహదారి మంజూరుతోపాటు అభివృద్ధి కోసం అత్యధికంగా నిధులు తేవాలని కోరారు.

ఎస్పీకి పితృవియోగం

వనపర్తి: ఎస్పీ రావుల గిరిధర్ తండ్రి రావుల నిరంజనచారి(84) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరంజనచారి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలియడంతో ఎస్పీ హుటాహుటిన వెళ్లిపోయారు. నిరంజనచారి జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో డిప్యూటీ రిజిస్ట్రార్, డీఆర్‌డీఏలో పరిపాలనాధికారిగా సేవలందించి రిటైర్డ్ అయ్యారు. ఎస్పీ తండ్రి మృతి పట్ల జిల్లా పోలీస్ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. మంగళవారం జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సమాంతర కాల్వ ద్వారా నీటి విడుదల నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా వెయ్యి క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి సమ్మె

పాలమూరు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరోగ్యశ్రీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 94 మంది ఆరోగ్య మిత్రులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి జీఓ 60 ప్రకారం వేతనం రూ.22,750 తక్షణమే అమలు చేయాలన్నారు. జీతాలు ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలని, హెల్త్‌కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళి, సంజీవ, ప్రదీప్, నరేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి



అమరవీరుల కుటుంబాలను శాలువాతో సత్కరిస్తున్న చైర్‌పర్సన్ ఎన్.ప్రీతమ్ తదితరులు

అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి

- ప్రజల ఆమోదంతోనే సంక్షేమ పథకాల అమలు
- రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎన్.ప్రీతమ్
- అట్టహాసంగా ప్రజాపాలన దినోత్సవం
- హాజరైన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రీతమ్, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎన్.ప్రీతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఏఎస్పీ రామదాసు తేజావత్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రగతి నివేదికను ప్రజలకు వివరించారు. అంతకు ముందు తెలంగాణ విమోచన పోరాటంలో ఆసువులు బాసిన అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17కు ఒక విశిష్టత ఉందని, 77 ఏళ్ల క్రితం ఇదే రోజున తెలంగాణ ప్రాంతం భారత్‌లో విలీనమైందని గుర్తుచేశారు. రాచరిక పరిపాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందన్నారు. తెలంగాణ చరిత్ర ఈనాటిది కాదని.. క్రీస్తు పూర్వం నుంచే ఈ గడ్డ మీద అభివృద్ధి చెందిన నాగరికత భాసిల్లిందన్నారు. వేల ఏళ్ల చరిత్రలో ఈ భూమిని ఎంతో మంది పాలించారని, ఒక దశలో రజాకర్ల అరాచకాల నుంచి విముక్తి కోసం ఎందరో పోరాటాలు చేసిన నేలగా తెలంగాణ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. అలాంటి పోరాటాల్లో చివరిది 1946 నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అన్నారు. ఒకవైపు రైతాంగ పోరాటం జరుగుతున్న సమయంలోనే 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఆ తర్వాత స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు భారత ప్రభుత్వ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రదర్శించిన ధైర్యం, చాకచాక్యంతో మిగతా సంస్థానాలు దేశంలో కలిసిపోయాయన్నారు. నాటి సంఘటనల దృష్ట్యా సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

దేశానికే ఆదర్శంగా..

తెలంగాణ రైతులు దేశానికే ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తోందని, సంక్షేమానికి, వ్యవసాయ పురోగతిగా అవసరమైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేసే దిశగా అడుగులు వేస్తోందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పథకాలతోపాటు వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. దైశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. జిల్లాలో రైతు రుణమాఫీ పథకంలో ఇప్పటి వరకు మూడు విడతల్లో 53,244 రైతు కుటుంబాలకు రూ.423.8 కోట్లు అందించామన్నారు. విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యా బోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కోసం మిషన్ మోడ్‌లో చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం దేశ, రాష్ట్ర సాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాల సభ్యులను ఆయన శాలువా, పూలమాలలతో సత్కరించారు.



నృత్యం చేస్తున్న బాలభవన్ విద్యార్థినులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాపాలన వేడుకల్లో బాలభవన్, కేజీబీవీ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను ఆకట్టుకుంది. నృత్యాలు చేసిన చిన్నారులను ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో చర్చించి..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ఆమోదంతో అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందుకు గ్రామసభలు, మంత్రివర్గ ఉపసంఘాలను ఏర్పాటు చేసి ప్రజలతో చర్చించిన తర్వాత ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. మహిళలు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచి.. ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మహాలక్ష్మి పథకంలో రూ.500కే వంటగ్యాస్ సరఫరా చేస్తుందన్నారు. పథకంలో 74,918 మందికి లబ్ధి చేకూరుతోందని, ఇప్పటి వరకు 37,373 మంది వినియోగదారులకు సిలిండర్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇందుకు ప్రభుత్వం రూ.10.3 కోట్ల నగదును సబ్సిడీ కోసం విడుదల చేసిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడంతోపాటు పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. డయాలసిస్ రోగులకు చికిత్స పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. గృహజ్యోతి పథకంతో జిల్లాలో 73,475 కుటుంబాలకు జీరో బిల్లులు జారీచేశామని, మొత్తం 1,27,295 కుటుంబాలకు ఈ పథకంతో లబ్ధి చేకూరుతోందన్నారు.

‘తెలంగాణ అస్థిత్వాన్ని కించపరిస్తే సహించం’



తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కూర్చొని నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తదితరులు

గోపాల్‌పేట: తెలంగాణ అస్థిత్వాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై నిరసనం వ్యక్తం చేశారు. ముందుగా వనపర్తి జిల్లా కేంద్రం నుంచి గోపాల్‌పేట వరకు పార్టీ కార్యకర్తలతో కలిసి బైకు ర్యాలీ నిర్వహించారు. గోపాల్‌పేటలో పెట్రోల్ బంకు వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నో ప్రయాసాలకోర్చి.. ప్రాణాలు త్యాగాలు చేసి.. తెలంగాణ అస్థిత్వాన్ని నిలబెట్టుకుని పదేళ్ల రాష్ట్రాన్ని సభిక్షంగా పాలించిన తర్వాత ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వం తెలంగాణకు సంబంధం లేని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాజీవ్‌గాంధీ అంటే దేశాన్ని పాలించిన నాయకుడిగా గౌరవిస్తాం కానీ, రాష్ట్ర సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేవలం ఉచిత బస్సు సౌకర్యం పథకం మాత్రమే అమలవుతోందని మిగతా పథకాలు మూలకు పడేశారని విమర్శించారు. రైతులకు ఎన్నో పథకాలు అమలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు శ్రీధర్, రమేష్‌గౌడ్, అశోక్, జాత్రునాయక్, చంద్రశేఖర్, రఘువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సహకార సంఘాలను ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల్లో ఇది వరకు తీసుకున్న రుణాలను వసూలు చేయాలని, అలాగే రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని పీఏసీఎస్ అధ్యక్షులు, డీసీసీబీ బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. అసైన్డ్ పట్టాలు ఉండి రుణమాఫీ పొందిన రైతులకు సైతం రుణాలు ఇవ్వాలన్నారు. సహకార సంఘాల అభివృద్ధి కోసం డీసీసీబీ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, బంగారు రుణాలు, డైలీ ఫైనాన్స్ వంటి వాటిపై రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థానిక సహకార సంఘం అభివృద్ధి కోసం పీఏసీఎస్ చైర్మన్, సిబ్బంది కొత్తగా ఆలోచనలు చేసి ప్రతిపాదనలు పంపిస్తే అమలు పర్చేందుకు డీసీసీబీ సిద్ధంగా ఉందన్నారు. డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకోని రైతులు పెట్టుబడి కోసం క్రాప్ లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారు రుణాలు చెల్లించకుంటే వారి నుంచి ఓటీఎస్ గురించి ఆలోచించకుండా వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంలో జిల్లాలోని పీఏసీఎస్‌ల చైర్మన్లు వంశీధర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, వెంకట్రావ్, రఘువర్ధన్‌రెడ్డి, మరళీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, జితేందర్‌రెడ్డి, భూపాల్‌రావ్, ఆయా సంఘాల సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు మహర్దశ!

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్

- ఉమ్మడి జిల్లాలో ‘రెండు’ ఏర్పాటు చేసే అవకాశం
- ఔత్సాహిక క్రీడాకారులకు ప్రయోజనం



మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న క్రీడాకారుల ఆశలు త్వరలోనే నెరవేరే అవకాశం ఉంది. స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నతనంలోనే విద్యార్థులకు నచ్చిన క్రీడలో శిక్షణ ఇచ్చి, వారి ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ వర్సిటీలో వసతి కల్పించనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ (హకీంపేట), కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఉండగా.. 4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదట జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఆయా క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు.

■ ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో రెండు స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. స్పోర్ట్స్ స్కూళ్ల ఏర్పాటుతో మహబూబ్‌నగర్‌తో పాటు వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో క్రీడాభివృద్ధికి మరింత అవకాశం ఉంటుంది. ఇటీవల రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుతో చాలా మంది చిన్నారులకు క్రీడల్లో శిక్షణకు అవకాశం లభిస్తుంది.

మెరుగైన వసతులు..

లోక్‌సభ పరిధిలో ఏర్పాటయ్యే స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నారులకు మెరుగైన క్రీడా వసతులు అందుబాటులోకి వస్తాయి. అధునాతన భవనాలతో పాటు ఫుట్‌బాల్, హాకీ మైదానాలు, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ ఇతర క్రీడల కోర్టులను ఏర్పాటు చేస్తారు. మొదట్లో జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయిలో ఎంపికలు నిర్వహించి, అందులో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు 4వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. స్కూల్‌లో చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ ఉంటుంది. మొదట చిన్నారులకు ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల్లో పరీక్షించి, వారు ఏ క్రీడలో రాణించే అవకాశం ఉందో, అందులో నిష్ణాతులైన కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థులకు ఆహార పరంగా ప్రత్యేకమైన మెనూ అమలు చేస్తారు. డైటీషియన్ పర్యవేక్షణలో ప్రత్యేక భోజనం అందజేస్తారు. క్రీడా విద్యార్థులకు పోషక పదార్థాల అవసరం మేరకు మెనూ నిర్ణయించి, అందుకు అనుగుణంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.

క్రీడా నైపుణ్యాలను వెలికి తీయవచ్చు..



స్పోర్ట్స్ స్కూళ్లతో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయవచ్చు. ప్రస్తుతం ఆయా క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయస్థాయిల్లో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలా మంది స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. స్పోర్ట్స్ స్కూళ్లతో చాలా మంది చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

సీఎం నిర్ణయం హర్షణీయం..



రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. స్పోర్ట్స్‌స్కూళ్లు ఔత్సాహిక క్రీడాకారులకు మంచి వేదికలా ఉపయోగపడుతాయి. భవిష్యత్‌లో నైపుణ్యం గల క్రీడాకారులుగా ఎదుగుతారు.

– బి.బాల్‌రాజు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్

‘చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే బుద్ధిచెబుతారు’



మాట్లాడుతున్న కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

పెబ్బేరు/వీపనగండ్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు కీలక పాత్ర పోషించాయని, రాజకీయ లబ్ధి కోసం కొన్ని పార్టీలు చరిత్రను వక్రీకరించాలని చూస్తున్నాయని వారికి ప్రజలే బుద్ధి చెబుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలంగాణ విమోచన వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ పోరాటంలో దాదాపు 4 వేల మంది అమరులయ్యారని గుర్తుచేశారు. రజాకార్లు, భూస్వాములు, నిజాం సైన్యం పేదలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని, అలాంటి వారికి ఆనాటి కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలిపి పలువురు ఉద్యమకారులు, కమ్యూనిస్టు నాయకులను నిర్దాక్షిణ్యంగా చంపేశారని ఆరోపించారు. వచ్చే నెల 9, 10 తేదీల్లో జిల్లా 3వ మహాసభలను నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, రాజు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ఘోర ప్రమాదం
- వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- వ్యవసాయ పనులకు వెళ్తున్న ఇద్దరు మృతి

8 లో..

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్
- పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు

8 లో..

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన ఖాజా

నాగర్‌కర్నూల్: విద్యుదాఘాతంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రామ్‌నగర్ కాలనీకి చెందిన మొహమ్మద్ ఖాజా (30) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఖాజా కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని కృష్ణయ్య ఇంటి వద్ద పెయింటింగ్ పనులు చేస్తున్న క్రమంలో ఇంటికి ఆనుకొని ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడు..


మృతి చెందిన ఛత్రపతి(ఫైల్)

చారకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అంకిల్ల ఛత్రపతి(20) గత నెల 30న కల్వకుర్తికి బైక్‌పై వెళ్తూ కల్వకుర్తి - దేవరకొండ ప్రధాన రహదారిపై అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 15 రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు.

కొ్ట్రలో..

వెల్దండ: మండల పరిధిలోని కొ్ట్రకి చెందిన భూత్కురి కృష్ణయ్య(50) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణయ్య కల్వకుర్తి పట్టణంలో హమాలీ పని చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. కృష్ణయ్యకు అనారోగ్యం కారణంగా చాతిలో నొప్పిగా ఉన్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

కిందపడి మహిళ..


జంపాల మాధవి (ఫైల్)

తెలకపల్లి: ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం .. తెలకపల్లిలోని బీసీ కాలనీకి చెందిన రాసాల శివశంకర్ భార్య జంపాల మాధవి(34) మంగళవారం తెల్లవారుజామున బాత్‌రూంకి వెళ్లి బాత్‌రూం ముందు కాలుజారి కిందపడింది. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి 108లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె గర్భవతిగా ఉందని, అనారోగ్యంతో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.ఆమె తల్లి జంపాల సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమెకు భర్త, కూతురు ఉన్నారు.

బస్టాండ్‌లో మృతదేహం..

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో బస్టాండ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. వ్యక్తి మృతదేహం బస్టాండ్‌లో ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.


మహంకాళి మందిర్ వారి వినాయక విజయం అలంకరణ..


అత్యాచార ఘటనలకు ఉరిశిక్ష వేయాలంటున్న చౌడేశ్వరీ మందిర్ అలంకరణ..


కొండారెడ్డిపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి వచ్చిన గణనాథులు


బైబై గణేశా..!


తలపై గణనాథుడితో చిన్నారి

బైబై గణేశా అంటూ నారాయణపేటలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోనే ఎంతో పేరున్న నారాయణపేట వినాయక నిమజ్జనం సోమవారం ప్రారంభమై మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. దాదాపు 30గంటలకు పైగా ప్రత్యేక వాహనాల్లో పట్టణ పురవీధుల గుండా జరిగిన శోభాయాత్రలో చారిత్రక, ఇతిహస, రాజకీయ అంశాలతో కలిపి లంబోదరులను అలంకరించారు. చిన్న, పెద్ద నృత్యాలు చేశారు. కోలాటం, అడుగుల భజనలు ఆకట్టుకున్నాయి. చౌక్‌సెంటర్‌లో వీహెచ్‌పీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండప నిర్వాహకులకు జ్ఞాపికలు అందించారు. కొండారెడ్డిపల్లి చెరువు దగ్గర మున్సిపల్, రెవిన్యూ, వైద్య, పోలీసుశాఖల సమన్వయంతో నిమజ్జనం పూర్తిచేశారు. ఎస్పీ యోగేష్‌గౌతమ్ భద్రతా ఏర్పాట్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించగా, కంట్రోల్ రూంలో పోలీసు సిబ్బంది సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గందె అనసూయ వేడుకల్లో పాల్గొన్నారు. - నారాయణపేట రూరల్


కొండారెడ్డిపల్లి చెరువులో గణనాథుడి నిమజ్జనం


కుమ్మరివాడ వృషభ గణపతి




లంకకు వారధి నిర్మాణ గణపతి


హనుమా ఫ్రెండ్స్.. రైతు ప్రాధాన్య గణపతి ..


సరాఫ్‌బజార్ రోడ్డు కోసం బుల్డోజర్‌తో గణపయ్య..


మోచివాడ..హిమాలయ గణపతి

బంగారం వ్యాపారి ఇంట్లో చోరీ


చిందరవందరగా చేసిన బీరువాలోని వస్తువులు


పెంట్లవెల్లిలో చోరీకి గురైన ఇంటి వద్ద విచారణ చేపడుతున్న శ్రీనివాసులు

- బీరువా పగలగొట్టి 30 తులాల ఆభరణాలు అపహరణ
- పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ఇంట్లో కారం చల్లిన దుండగులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఎండీ సయ్యద్ బంగారం వ్యాపారి ఇంటికి తాళం వేసి ఉండగా.. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి 30 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి నాగర్‌కర్నూల్ జిల్లా డీఎస్పీ క్లూస్‌టీంతో చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. మంగళవారం బంగారం వ్యాపారీ ఇంట్లో చోరీ జరిగిందనే ఫిర్యాదు మేరకు ఇక్కడికి వచ్చామన్నారు. ఇంటిని పరిశీలించగా.. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి బీరువాలోని 30 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారన్నారు. దొంగలు పక్కా ప్లాన్‌తో ఇంట్లో మొత్తం కారం చల్లి చోరీ చేశారని చెప్పారు. అందుకే క్లూస్‌టీంతో అన్ని విధాలుగా క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు సేకరించామన్నారు. కచ్చితంగా దొంగలను పట్టుకుంటామని, చుట్టుపక్కల వారిని వివరాలు అడిగి తెలుసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

మళ్లీ తెగిన కేఎల్‌ఐ కాల్వ


మున్ననూర్ వద్ద తెగిపోయిన కేఎల్‌ఐ కాల్వ

మిడ్జిల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మిడ్జిల్ మండల పరిధిలోని మున్ననూర్ వద్ద కేఎల్‌ఐ కాల్వ తెగిపోవడంతో రైతులకు ఇబ్బంది కలుగవద్దని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన కాల్వకు మరమ్మతు చేపట్టి, తెగిన వద్ద బండింగ్ ఏర్పాటు చేసి నీటిని వదలడంతో, మళ్లీ మంగళవారం రాత్రి బండింగ్ తెగిపోవడంతో నీరు దుందుభి వాగులోకి చేరుతుంది. రైతులకు 15 రోజుల నుంచి నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి, తెగిన చోట రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి సాగు నీరు వదులుతామని ఫోన్‌లో తెలియజేశారు. ఉన్నత అధికారులతో మాట్లాడామని, పనులు వేగవంతం చేసి, త్వరగా నీరు విడుదల చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.

త్వరగా పూర్తి చేయాలి..

మున్ననూర్ వద్ద తెగిపోయిన కేఎల్‌ఐ కాల్వకు వెంటనే మరమ్మతు చేపట్టి రైతులకు సాగునీరు విడుదల చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు మరమ్మతు ఆలస్యం చేస్తే రైతుల పక్షాన ఆందోళన చేపడుతామని ఒక ప్రకటనలో తెలియజేశారు.

పాముకాటుకు బాలుడు బలి

వనపర్తి రూరల్: హైదరాబాద్ ఉప్పల్‌లో పాముకాటు గురై సోమవారం రాత్రి బాలుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని పెద్ద గుడెం తండా పై గడ్డకు చెందిన లక్ష్మణ్, పల్లవి దంపతులు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారి కుమారుడు అశ్విత్(4) సోమవారం రాత్రి పాము కాటు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కేటీదొడ్డి: రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కుచినెర్లకి చెంది నిఖిల్ బైక్‌పై గద్వాలకు వెళ్తున్నాడు. ఆ సమయంలో మైలగడ్డకి చెందిన తిప్పన్న(65) మైలగడ్డ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్ర గాయాలైన తిప్పన్నను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు.

కర్నిలో డెంగీతో విద్యార్థి మృతి

మక్తల్: మక్తల్ మండలం కర్నికి చెందిన ఇమ్రాన్(14) డెంగీతో బాధపడుతూ.. మంగళవారం మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విద్యార్థి మక్తల్‌లో భారతి విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుకుంటున్నాడు. విద్యార్థి మృతిచెందడంతో పాఠశాలకు సెలవు ఇచ్చారు. విద్యార్థి డెంగీతో మృతిచెందడంతో పలువురు విచారం వ్యక్తంచేశారు.

చెరుకు రైతులను ఆదుకోవాలి


ఆత్మకూర్‌లో కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ అధికారులతో సమావేశమైన చెరుకు రైతులు

ఆత్మకూర్: చెరుకు రైతుల సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని కృష్ణవేణి చెరుకు రైతుసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే రాజన్న, ఉపాధ్యక్షుడు వాసారెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లో కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ అడ్వయిజర్ రామ్మోహన్‌ప్రసాద్, కేసీడీఎం పాండురంగారావ్, మేనేజర్లు రాములు, హేమాద్రి, ఏఓ మన్సూర్ అలీఖాన్‌లతో ఉమ్మడి జిల్లా రైతులు సమావేశమయ్యారు. చెరుకు కటింగ్ ట్రాన్స్‌పోర్టు పోను మద్దతు ధర రికవరీతో సంబంధం లేకుండా టన్నుకు రూ.3 వేలు ఇవ్వాలని, కోతలకు సరిపడా లేబర్‌ను రప్పించి నిర్ణయించిన ధరలకే కోతలు చేపట్టాలని, విత్తనం బిల్లులను 45 రోజుల్లోపే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అధిక దిగుబడి వచ్చే విత్తనాలు సరఫరా చేయాలని, వేరు పురుగు నివారణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రవి, నాగేంద్రం, రంగారెడ్డి, చంద్రసేనారెడ్డి, మహేంద్ర, సుధాకర్‌రెడ్డి, ధనుంజయ, అరుణ్‌కుమార్, తిరుపతయ్య, వెంకటచారి, రాజు, చంద్రారెడ్డి, నల్లారెడ్డి, నాగరాజు, శ్రీకాంత్, రాజేందర్‌గౌడ్, గోవిందు, రైతులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకోండి


అమ్మమ్మ మృతదేహం వద్ద విలపిస్తూ నిస్సహాయ స్థితిలో నిల్చున్న చిన్నారులు

శాంతినగర్: తల్లిదండ్రి, తోడు నీడ లేని అనాథ పిల్లలను ఆదుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న వృద్ధురాలు జయమ్మ మంగళవారం మృతిచెందింది. వృద్ధురాలైన జయమ్మ తన ఇద్దరు మనవళ్లను పోషిస్తూ.. వారిని చదివించుకుంటూ కాలం వెల్లదీస్తోంది. అకస్మాతుగా వృద్ధురాలు మృతిచెందడంతో అమ్మమ్మను ఆసరాగా చేసుకుని జీవిస్తున్న ఇద్దరు చిన్నారుల పరిస్థితి రోడ్డుమీద పడినట్టయింది. అమ్మమ్మ మృతదేహం వద్ద వారు అచేతన స్థితిలో నిల్చున్న చిన్నారుల దుస్థితిని చూసి పట్టణవాసులు సైతం కన్నీటిపర్యంతమయ్యారు. అంత్యక్రియలకు సైతం ఎవరూ లేకపోవడంతో సమీపంలోని వారి బాగోగులు చూసే వ్యక్తి, పట్టణవాసుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు. చిన్నారుల తండ్రి ఉషేష్‌గౌడ్ కొన్నేళ్ల కిందట మృతిచెందాడు. ఆరునెలల కిందట తల్లి క్రిష్ణవేణి అకస్మాతుగా మృతిచెందింది. ఇంటి నిర్మాణానికి, దుకాణాల నిర్మాణానికి తీసుకొచ్చిన అప్పుల బాధ భరించలేక మనోవేదనకు గురై మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అంతేగాక వారు నివాసం ఉంటున్న ఇల్లు కోర్టు వివాదంలో ఉందని, చిన్నారులకు నిలువ నీడలేదని, వారిని పోషించేవారు లేక అనాథలయ్యారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, ఎమ్మెల్యే, అధికారులు స్పందించి వారికి ఆశ్రయం కల్పించి ఇద్దరు బాలుర విద్యాభ్యాసం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు, స్థానికులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్

- పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు
- స్థానికుల సహాయంతో సురక్షితంగా బయటపడ్డ విద్యార్థులు


పంట పొలంలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు


బస్సులో నుంచి సురక్షితంగా బయటపడిన విద్యార్థులు

గద్వాల క్రైం: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు స్కూల్ బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన గద్వాల మండలం పరుమాల గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మల్దకల్ మండలం మద్దెలబండా, ఆడవిరావుల్ చెరువు, కుర్వపల్లి, గద్వాలకు చెందిన విద్యార్థులు 50 మంది రోజు మాదిరిగానే జిల్లా కేంద్రంలోని ప్రగతి విద్యానికేతన్ స్కూల్ బస్సులో బయలుదేరారు. ఈ క్రమంలో డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతో పరుమాల గ్రామ సమీపంలో బస్సు అదుపు తప్పింది. డ్రైవర్ బస్సును నియంత్రించలేక పోవడంతో పంట పొలాల్లోకి దూసుకెళ్లి ఓ చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. బస్సులోని విద్యార్థులు భయాందోళనకు గురై కేకలు వేశారు. గమనించిన స్థానికులు క్షణాల్లో విద్యార్థులను బస్సు వెలుపలి నుంచి బయటకు తీసుకువచ్చారు. ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఘటనా స్థలానికి పరుగులు..

పాఠశాల బస్సులో విద్యార్థులు బయలుదేరిన 30 నిమిషాల వ్యవధిలోనే ప్రమాదానికి గురికావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలుసుకునేందుకు ఘటనా స్థలానికి పరుగులు తీశారు. గద్వాల నుంచి అయిజ వైపు వెళ్తున్న పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు స్పందించి, విద్యార్థులకు మనోధైర్యం కల్పించారు. భయాందోళనకు గురై ఏడుస్తున్న చిన్నారులను ఓదార్చి మంచినీళ్లు అందించారు. స్కూల్ బస్సు ప్రమాదంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా, బస్సు డ్రైవర్ ఆంజనేయులు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినట్లు విద్యార్థులు చెప్పారు. ఇదిలా ఉండగా, బస్సులో 41 మంది విద్యార్థులను తీసుకెళ్లేందుకు అనుమతి ఉండగా.. 50 మందికి పైగా విద్యార్థులను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బస్సుకు సంబంధించి ఇన్సురెన్స్ గడువు సైతం ముగిసినట్లు తెలిసింది. అయితే పోలీసులకు అందిన ఫిర్యాదులో ముందు వెళ్తున్న ఎడ్లబండి, బైక్‌ను తప్పించే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొనడం కొసమెరుపు. బస్సు పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్, డ్రైవర్ సామర్థ్యం, లైసెన్స్ తదితర అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించి, ఎలాంటి చర్యలు చేపడుతారనే చర్చ సాగుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

హైవేపై ఘోర ప్రమాదం

- వెనక నుంచి లూనాను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ప్రమాదంలో ఇద్దరు వ్యక్తుల దుర్మరణం
- వ్యవసాయ పనులకు వెళ్తుండగా ఘటన


సంఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు, లూనా


ఎనుమల రాముడు (ఫైల్)


మసీద్ శేఖర్ (ఫైల్)

వనపర్తి రూరల్: నిత్య ప్రమాదాలకు అడ్డాగా మారిన జాతీయ రహదారి-44పై మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల కోసం లూనాపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో దుర్మరణం పాలయ్యారు. ఈ విషాదకర సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎనుమల రాముడు(56), మసీద్ శేఖర్(55) ఇద్దరూ కలిసి మంగళవారం ఉదయం లూనాపై వ్యవసాయ పొలానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని పొగాకు కంపెనీ ఎదుట జాతీయ రహదారి-44 (కర్నూలు వైపు) దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి వేగంగా దూసుకువచ్చిన ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సు వెనక నుంచి ఢీకొట్టడంతో ఎనుమల రాముడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. అలాగే తీవ్రంగా గాయపడిన మసీద్ శేఖర్‌ను హైవే అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎనుమల రాముడు కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంగాపూర్‌లో విషాదఛాయలు..

గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎనుమల రాముడుకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మసీద్ శేఖర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ దగ్గరికి వెళ్లి మృతదేహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత సచ్చిదానందశాస్త్రి కన్నుమూత



నగరంపాలెం: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి (90) కన్నుమూశారు. వృద్ధాప్యంతో బాధపడుతోన్న ఆయన సోమవారం రాత్రి గుంటూరు అమరావతిరోడ్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారులు శివశాస్త్రి, శ్రీరామచంద్రమూర్తి, కృష్ణ మోహన్, కుమార్తె దుర్గవెంకటసుబ్బలక్ష్మీ ఉన్నారు. ఆయన భార్య గతంలోనే చనిపోయారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలను గుంటూరు బొంగరాల బీడు శ్మాన వాటికలో నిర్వహించినట్లు పెద్ద కుమారుడు శివశాస్త్రి తెలిపారు. సచ్చిదానందశాస్త్రి గతేడాది జనవరిలో పద్మశ్రీ అవార్డు, 2022లో సంగీతనాటక అకాడమి అవార్డు, 2023 నవంబర్‌లో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2015లో హంసా పురస్కారం, 2009లో కొప్పరపు కవుల పురస్కారాలను అందుకున్నారు. గతంలో పలువురు ముఖ్య మంత్రుల నుంచి అవార్డులను స్వీకరించారు.

ఆయన కథాగానం.. జనరంజకం..

చిన్న పిట్టకథలు, చతురోక్తులతో 'కోట'కథాగానం జనరంజకంగా సాగేది.. మధూకరం చేసుకుంటూ వేదవిద్యను నేర్చుకుని, హరికథను సాధన చేసి, ప్రఖ్యాత హరికథకుడిగా 'కోట'ఎదిగారు. హరికథకు తొలిసారిగా పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా కీర్తిని పొందారు. రామాయణ, భారత, భాగవతాలను గానం చేస్తూ విశేష ప్రాచుర్యం కల్పించారు. 7 దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. 8 పదుల వయసులోనూ కథాగానం చేస్తూ వచ్చారు. సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. 57 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. ఆసక్తి కలిగిన శిష్యులకు శిక్షణనిస్తూ వచ్చారు. చతురోక్తులు, సరస సంభాషణలతో ప్రేక్షకుల మనసు తనపై లగ్నమయ్యేవరకు కాలక్షేపం చేసి, కథాంశంతో హరికథను ఆరంభించేవారు. భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలను చొప్పించటం, నృత్యాలు, అభినయం, నాటకీయతను చేర్చి హరికథను జనరంజకం చేశారు. ఈ ప్రత్యేకతతో వారికి ఎంతో డిమాండ్ ఏర్పడింది. ఒక్కరోజు విరామం లేకుండా హరికథలు చెప్పేవారు. బొత్తిగా చదువులేని వారికీ విద్య నేర్పారు. ఎలాంటి ప్రతిఫలం తీసుకోలేదు. వారంతా హరికథను వృత్తిగా స్థిరపడినవారే.



చూడ్డానికి ఏవో గ్రహాంతర జీవుల్లా కనిపిస్తున్నాయి కదూ.. కానీ ఇవన్నీ ఈ గ్రహంలోని జీవులే. మనకు బాగా తెలిసినవే. ఇవి చేపలు. గుడ్డు నుంచి బయటకువచ్చాక.. చేప పిల్లలు యోక్ సాక్(పచ్చసొన)కు అతుక్కుని ఉన్న దశలో తీసిన చిత్రమిది. ఈ ఫొటో ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీల్లో ఓషన్ పోర్ట్‌ఫోలియో విభాగంలో విజేతగా నిలిచింది. ఈ చిత్రాన్ని కెనడాకు చెందిన షేన్ గ్రాస్ అనే ఫొటో గ్రాఫర్ తీశారు. గుడ్డు నుంచి బయటకువచ్చాక పిల్లలు తొలి దశలో ఈ పచ్చసొననే కరిగించుకుని ఆహారంగా తీసుకుంటాయట.

డిటోనేటర్లతో చెరువు మత్తడి పేల్చివేత

సగానికి పైగా నీరు వృథా



వృథాగా పోతున్న నీరు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడిని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్లతో పేల్చివేశారు. దీంతో మత్తడి పూర్తిగా ధ్వంసమై చెరువులోని సగానికి పైగా నీరంతా వృథాగా పోయింది. ఈ సంఘటన చెన్నూర్‌లో సంచలనం సృష్టించింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న మత్తడి పేల్చివేత శబ్దం సమీప ప్రాంత ప్రజలకు వినిపించింది. గణేశ్ నిమజ్జనం ఉండటంతో బాణసంచా పేల్చి ఉంటారని భావించారు. రాష్ట్రంలో ఓ వైపు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రాను తీసుకొచ్చి ఆక్రమణలను తొలగిస్తోంది. మరోవైపు ఆయకట్టుకు నీరందించే చెరువు మత్తడిని డిటోనేటర్లతో పేల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. సుమారు 50 ఎకరాలకు నీరందించే చెరువు నీరు వృథాగా పోవడంతో రైతులు, చెరువులో చేపలు పట్టి జీవించే మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ విష్ణుప్రసాద్, డీఈ వేణుగోపాల్, ఏఈ తిరుపతి, స్థానిక సీఐ రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఆదేశాల మేరకు ఇసుక బస్తాలు వేసి నీరు వృథా పోకుండా చర్యలు చేపడతామని విష్ణుప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ వెల్లడించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఆ శిక్ష.. ఐపీఎస్‌లపై కక్ష!

తనను అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని మనసులో పెట్టుకున్న బాబు

అధికారులను అక్రమ కేసులతో వేధిస్తున్న ఏపీ ప్రభుత్వం ● ఇందులో భాగంగా హనీ ట్రాప్, ఫోర్జరీ కేసుల్లో నిందితురాలైన జత్వానీకి వత్తాసు



సాక్షి, అమరావతి: వలపు వల (హనీ ట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిల్ చేయడం ఆమె వ్యవహార శైలి.. ఫోర్జరీ పత్రాలతో మోసాలకు పాల్పడటం ఆమె నైజం.. ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు ఆమె నేర చరిత్రకు సాక్ష్యం.. ఫోర్జరీ నేరంపై విజయవాడ న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్.. ఇదీ ఇటీవల నేపథ్యం.. తీవ్రమైన నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీ నిరాధార ఆరోపణలతో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేస్తే, ప్రభుత్వం ఎలా స్పందించాలి? ఆమెను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ద్వారా రిమాండ్ విధించిన అధికారులపై కక్ష పూరితంగా ఆరోపణలు చేస్తున్నట్టుగా భావించాలి. మరోవైపు ఆమె ఆరోపణలు ఎంత వరకు వాస్తవమో దర్యాప్తునకు ఆదేశించాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. జుగుప్సాకరమైన, తీవ్రమైన ఆర్థిక నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీకి చంద్రబాబు ప్రభుత్వం విశిష్ట అతిథి స్థాయిలో ప్రోటోకాల్ మర్యాదలు చేస్తోంది. ఆమె ఫిర్యాదును సాకుగా చేసుకుని డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఐజీ టి.కాంతి రాణా, డీఐజీ విశాల్ గున్నీలను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. ఎన్నికలకు ముందు తనను అరెస్ట్ చేయడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు.. అధికారంలోకి రాగానే సీనియర్ ఐపీఎస్ అధికారులపై.. అదీ ఏకంగా డీజీ స్థాయి, ఐజీ, డీఐజీ స్థాయి అధికారులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. వ్యక్తిగత కక్షతోనే ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం మేరకు కుట్ర పూరితంగా కక్ష సాధింపునకు పాల్పడుతోంది.

కాదంబరితో క్విడ్ ప్రో కో కుట్ర

వలపు వల (హనీట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడటమే వ్యాపకంగా మార్చుకున్న కాదంబరి జత్వానీతో కూడా చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కో కుట్రకు తెరతీసింది. ఫోర్జరీ పత్రాలతో భూములు కొల్లగొట్టేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయిన ఆమెతో టీడీపీ ప్రభుత్వం అవగాహనకు రావడం విడ్డూరంగా ఉంది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన కేసుల్లో నిందితురాలికి వత్తాసు పలుకుతూ ఐపీఎస్ అధికారులను వేధిస్తుండటం పట్ల అఖిల భారత సర్వీసు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నేర చరిత్ర ఉన్న కాదంబరి జత్వానీతో తప్పుడు ఫిర్యాదు ఇప్పించి.. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి.కాంతిరాణా, విశాల్ గున్నీలను ఇప్పటికే ఏకపక్షంగా సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. వారిపై మరిన్ని వేధింపులకు పాల్పడేందుకు సన్నద్ధమవుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాదంబరి జత్వానీ విజయవాడలో ప్రత్యక్షం కావడం వెనుక పక్కా కుట్ర దాగి ఉందని అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. గతంలో ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసును నీరుగారుస్తామని చెబుతూ.. అందుకు ప్రతిగా ఆ ముగ్గురు ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయమని ఆమెకు షరతు విధించినట్టు స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వ కథ, స్క్రీన్ ప్లే ప్రకారం కాదంబరి జత్వానీ నెల రోజులుగా విజయవాడలో హైడ్రామా సృష్టిస్తున్నారు. జత్వానీపై ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. వలపు వలతో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్ చేయడం ఆమె వ్యాపకంగా చేసుకున్నారని పలు ఫిర్యాదులు, విమర్శలు ఉన్నాయి.

నిందితురాలితో ప్రభుత్వం కుమ్మక్కు

పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌కు చెందిన ఐదు ఎకరాలను ఫోర్జరీ పత్రాలతో మరొకరికి విక్రయించేందుకు కూడా కాదంబరి జత్వానీ బరి తెగించారు. వెంటనే అప్రమత్తమైన విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయడంతో విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానం అనుమతితో నిబంధనలను పాటిస్తూ ముంబయిలో ఆమెను అరెస్ట్ చేసి విజయవాడ తీసుకువచ్చారు. ఫోర్జరీ అభియోగాలకు సంబంధించి పోలీసులు సమర్పించిన ఆధారాలతో న్యాయస్థానం సంతృప్తి చెంది ఆమెకు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన జత్వానీ గతంలో పాల్పడిన తీవ్రమైన, జుగుప్సాకరమైన నేరాలు ఒక్క దెబ్బతో మాయమైపోయినట్టు కాదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం తన ఫోర్జరీ బాగోతాన్ని ఆధారాలతోసహా వెలికి తీసినందుకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఆమె కక్ష గట్టారు. కాగా ఆ పోలీసు అధికారులను అక్రమ కేసులతో వేధించాలని నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం కాదంబరి జత్వానీని తమ కుట్రలో భాగస్వామిగా చేసుకుంది. ప్రభుత్వ పెద్దలు ఆమెతో ఇటీవల ఇప్పించిన ఫిర్యాదుతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఇంకొందరు పోలీసు అధికారుల పేర్లను కూడా చేర్చేందుకు సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది.

మరో టార్గెట్ రామకృష్ణే ..

చంద్రబాబు, ఈనాడు రామోజీరావు కుటుంబం క్విడ్ ప్రో కోకుట్ర మరోసారి అధికారికంగా బట్టబయలవుతోంది. అందులో భాగంగానే స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ పూర్వపు ఐజీ రామకృష్ణకు టీడీపీ కూటమి ప్రభుత్వం గురి పెట్టింది. ఎందుకంటే.. రామోజీరావు కుటుంబం దశాబ్దాలుగా మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా యథేచ్ఛగా పాల్పడిన ఆర్థిక అక్రమాలను ఆధారాలతో సహా ఆయన నిగ్గు తేల్చారు. కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు రామకృష్ణ ప్రయత్నించారు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు కుటుంబం మార్గదర్శి చిట్స్ చందాదారుల సొమ్మును అక్రమ మార్గాల ద్వారా మళ్లించి తమ కుటుంబ వ్యాపార సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులుగా పెట్టినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గుర్తించింది. ఘోస్ట్ చందాదారుల పేరుతో అక్రమాలు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర ఆర్థిక నేరాలను వెలుగులోకి తెచ్చింది. దాంతో రెండేళ్లపాటు మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో కొత్త చిట్టీ గ్రూపులు నిలిచి పోవడంతో రామోజీ కుటుంబ ఆర్థిక అక్రమాల పునాదులు కదిలాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్రమాలకు పక్కా ఆధారాలు లభించడంతో గత ఏడాది రామోజీరావు (ప్రస్తుతం చనిపోయారు), ఆయన కోడలు శైలజ కిరణ్‌ను హైదరాబాద్‌లో విచారించారు. ఇది ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న చంద్రబాబుకు ఏమాత్రం రుచించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామకృష్ణను వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనకు పోస్టింగు ఇవ్వనే లేదు. మరోవైపు ఐఆర్ఎస్ అధికారిగా ఆయన డెప్యుటేషన్ పూర్తి కావడంతో కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయకపోయినా సరే.. డీమ్డ్ టు బీ రిలీవ్డ్‌గా పరిగణించి ఆయనకు కేంద్ర ప్రభుత్వం పోస్టింగు ఇచ్చేందుకు సిద్ధమైంది. నిబంధనల మేరకు సాగుతున్న పరిణామాలపై రామోజీరావు కుటుంబం భగ్గుమంది. రామకృష్ణను లక్ష్యంగా చేసుకుని ఈనాడు పత్రికలో రెండు రోజులుగా ప్రత్యేక కథనాలు ప్రచురించారు. రాజగురువు కుటుంబానికి ఆగ్రహం కలిగిందని బెంబేలెత్తిన చంద్రబాబు ప్రభుత్వం.. నిబంధనలను అతిక్రమించేందుకు కూడా వెనుకాడటం లేదు. రామోజీ కుటుంబాన్ని సంతృప్తి పరిచేందుకు రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాన్ని ఆదేశించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వ అధికారి అయిన ఆయనపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ వర్గాలు తర్జన భర్జన పడుతున్నాయి. కానీ రామోజీ కుటుంబం కళ్లల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యం.. అన్నట్టు రామకృష్ణపై చర్యలు తీసుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో రామకృష్ణపై ప్రభుత్వం ఒకట్రెండ్రోజుల్లో కక్ష సాధింపు చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

వన్యప్రాణుల రక్షణకు సంసిద్ధంగా ఉండాలి

మన్ననూర్: ప్రమాదంలో చిక్కుకున్న వన్యప్రాణులను కాపాడేందుకు శిక్షణ పొందిన వారు సంసిద్ధంగా ఉండాలని అటవీ అధికారులు అన్నారు. స్థానిక అటవీశాఖ ఈసీ సెంటర్‌లో రెండోరోజు శిక్షణలో భాగంగా వన్యప్రాణులను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రెస్క్యూ టీం సభ్యులు ప్రయోగాత్మకంగా వివరించారు. మంగళవారం అమ్రాబాద్ డివిజన్ పరిధిలోని సుమారు 33 మంది ఎఫ్ఆర్‌ఓ, ఎఫ్ఎస్ఓ, బీట్ ఆఫీసర్లు, వాచర్లు, ఎన్‌జీఓ, బయాలజిస్టులు పాల్గొన్న శిక్షణ కార్యక్రమంలో మహారాష్ట్రలోని పుణెకు చెందిన రెస్క్యూ టీం సభ్యులు అత్యంత కీలకమైన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులు ప్రమాదవశాత్తు బావిలో పడినప్పుడు, ఎత్తైన ప్రదేశంలో చిక్కుకున్నప్పుడు ఉపయోగించాల్సిన పరికరాల సహాయంతో వాటిని కాపాడే విధానాలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అటవీ శాఖ సిబ్బందిని సిద్ధం చేయడం ఈ శిక్షణ ఉద్దేశం అని ఎన్‌జీఓ బాపిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, ఎఫ్ఆర్‌ఓ దేవజ, గురుమూర్తి, డీఆర్‌ఓ రవి, ఎఫ్ఎస్ఓలు రామాంజనేయులు, బాబలి, వెంకటేశ్వర్లు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన వ్యక్తికి 17 నెలల జైలుశిక్ష

జడ్చర్ల: ఓ మహిళను తనమాయ మాటలతో మోసం చేసి బంగారం, నగదు అపహరించిన వ్యక్తికి జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి మహ్మద్ ముదస్సీర్ 17 నెలల జైలు శిక్ష, రూ.వేయి జరిమానా విధించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లికి చెందిన చీకూరి చుక్కమ్మ గతేడాది ఫిబ్రవరి 10న బాదేపల్లిలోని గాంధీ చౌరస్తాలో నిలబడి ఉండగా.. ఓ అపరిచిత వ్యక్తి ఆమె దగ్గరకు వచ్చి తాను ఫొటో దిగేందుకు నీ మెడలో ఉన్న గుండ్ల దండను ఇవ్వాలంటూ మాయమాటలు చెప్పి నమ్మించాడు. అపరిచితుడి మాటలు నమ్మి తన మెడలో ఉన్న బంగారు గుండ్ల దండను అతనికి ఇచ్చింది. ఆ తర్వాత తన మాటలతో నేతాజీ చౌరస్తాలోని ఓ వస్త్ర దుకాణం దగ్గరకు తీసుకెళ్లి.. అక్కడ ఆమెను కూర్చోబెట్టి మద్యం తీసుకువస్తానంటూ ఆమె దగ్గర రూ.2వేలు నగదు తీసుకుని పరారయ్యాడు. మోసపోయిన మహిళ ఇంటికి వెళ్లి విషయాన్ని తన కుమారుడికి వివరించింది. అనంతరం బాధితురాలు తన కుమారుడితో కలిసి వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ రమేశ్‌బాబు దర్యాప్తు చేపట్టి మిడ్జిల్ మండలం వెలుగొమ్ములకి చెందిన కావలి లక్ష్మయ్యను నిందితుడిగా గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన జడ్జి నిందితుడికి శిక్షను ఖరారు చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్‌–ఉన్‌–నబీ


● మహబూబ్‌నగర్‌లో ముస్లింల భారీ ఊరేగింపు



క్లాక్‌టవర్ నుంచి ముస్లింల ఊరేగింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: మిలాద్‌–ఉన్‌–నబీ సందర్భంగా మంగళవారం సాయంత్రం అసర్ నమాజు అనంతరం జిల్లాకేంద్రంలో ముస్లింలు భారీ ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. ఆయా కాలనీల నుంచి సమూహంగా తరలివచ్చిన ముస్లింలు క్లాక్‌టవర్ నుంచి భారీ ఊరేగింపుగా బయలు దేరారు. 'నారే తక్బీర్ అల్లాహ్ హోఅక్బర్, నారే రిసాలత్ యా రసూలుల్లాహ్' అంటూ నినాదాలు చేస్తూ అశోక్ టాకీస్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్ చౌరస్తా మీదుగా షాసాబ్‌గుట్ట దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా ఆవరణలో షాసాబ్‌గుట్ట పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ అధ్యక్షతన ధార్మిక సభ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త మౌలానా నిసార్ అహ్మద్ ధార్మిక సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మతపెద్దలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం...



అంబేద్కర్ చౌరస్తాలో ఖౌమీ ఏక్తా కమిటీ వేదిక వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్, ఆనంద్‌గౌడ్

అంబేద్కర్ చౌరస్తాలో ఖౌమి ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత తదితరులు ఊరేగింపునకు స్వాగతం పలికారు. ముస్లిం పెద్దలను ఎమ్మెల్యే సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలన్నారు. మహబూబ్‌నగర్ ప్రజలు ఎంతో సౌమ్యులని, తరతరాలుగా ఈ పట్టణంలో శాంతి, సహనంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకునే సంప్రదాయం కొనసాగుతుందని, అదే స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. కొత్వాల్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త (స.అస) ప్రపంచానికి శాంతిని, మత సామరస్యాన్ని బోధించినట్లు తెలిపారు. ర్యాలీలో పలు సంస్థలవారు షర్బత్, నీళ్లు, పండ్లు అందజేశారు. అదే విధంగా న్యూటౌన్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఊరేగింపుకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఖౌమీ ఏక్తా కమిటీ కార్యదర్శి రఫీక్ పటేల్, టీజీఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జామీయ మజీద్ కమిటీ కార్యదర్శి అబ్దుల్‌జకీ, మజహర్ షహీద్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, అజ్మత్‌అలీ, ఇమ్రాన్, అవేజ్, షాఫైసల్, ఫయాజ్, ఫక్రు ఖురేషి , ఆయా సంస్థల ప్రతినిధులు మోసీన్‌ఖాన్, ఖుద్దూస్‌బేగ్, తఖీ హుస్సేన్, జహంగీర్‌బాబా తదితరులు పాల్గొన్నారు. ఊరేగింపు సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్



నెట్టెంపాడు ఎత్తిపోతలకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోల భాగంగా లిఫ్ట్‌–1 గుడ్డెందొడ్డి వద్ద ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగించి రిజర్వాయర్లను నింపుతున్నారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు మంగళవారం స్వల్పంగా పెరిగింది. సోమవారం సాయంత్రం 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 35,500 క్యూసెక్కులకు పెరిగింది. కాగా.. విద్యుదుత్పత్తి కోసం 25,980 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 28,255 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.542 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా..ఎనిమిది యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఎగువలో 4 యూనిట్ల ద్వారా 156 మెగావాట్లు, 178.871 ఎంయూ, దిగువలో 4 యూనిట్ల ద్వారా160 మెగావాట్లు, 151.416 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 330.287 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 881.7 అడుగులు.

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం నీటిమట్టం 881.7 అడుగుల వద్ద 197.4616 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 40,949 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,755 మొత్తం 67,871 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడు ద్వారా 35,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,440, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,202 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.838 మి.యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.962 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు. జలాశయంలో 144 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

డీఐజీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో జోగుళాంబ జోన్‌–7 డీఐజీ కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండాను డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల పాలన, గౌరవానికి సంబంధించిన వేడుకగా ప్రజా పాలన దినోత్సవం జరుపుకోనున్నట్లు పేర్కొన్నారు. కాగా.. జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, సీఐ శివకుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్ పాల్గొన్నారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి

ఆహార పదార్థాల పంపిణీలో ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష గణాంకాధికారి మధుసూదన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: కేజీబీవీల్లో విద్యార్థినులకు అందించే ఆహారం, వంట, వడ్డించు అంశాల్లో నిర్దేశించిన ప్రామాణికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకాధికారులు విధిగా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష గణాంకాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో కేజీబీవీ ప్రత్యేకాధికారులకు ఆహార పదార్థాల నాణ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ విద్యార్థినులకు ఆహార పదార్థాలు, వంటలు, సరుకులను ప్రామాణికాన్ని ప్రత్యేక అధికారులు విధిగా పరిశీలించి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. వంట మనుషులు వండే ఆహార పదార్థాలను ఒకటికి రెండుసార్లు శుభ్రపరిచి వండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వంట మనుషులు, వంట చేసే పరిసరాలు అత్యంత శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బాలికల ఆరోగ్య విషయంలో అలసత్యం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కేజీబీవీ పర్యవేక్షణాధికారి శోభారాణి మాట్లాడుతూ కేజీబీవీల్లో విద్యార్థినులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన రుచికరమైన భోజనం అందేలా చూడాలని చెప్పారు. రానున్న ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 20 కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న 42 సీఆర్టీ పోస్టులు భర్తీ చేసేందుకు కలెక్టర్ ఆమోదంతో ఇది వరకే రోస్టర్ పాయింట్ ద్వారా ఉన్న జాబితాతో చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్‌రెడ్డి, వెంకట్రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం గోల్‌మాల్‌పై ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబాలు

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు కేటాయించిన పునరావాసం(ఆర్‌అండ్‌ఆర్)భూములకు సంబంధించి రైతులకు ప్రభుత్వ పరిహారంలో చోటుచేసుకున్న గోల్‌మాల్ వ్యవహారంపై.. మంగళవారం జయప్రకాశ్‌నగర్‌లో బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గ్రామంలో పెద్ద మనుషుల పంచాయతీ పెట్టి ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. జయప్రకాశ్‌నగర్ సమీపంలో 407, 425, 426 సర్వే నంబర్లలోని 4.20 ఎకరాలలో ఉన్న గైరాన్ భూమిని దాదాపు 50 కుటుంబాలకు చెందిన రైతులు సాగు చేస్తున్నారు. అయితే ఆయా భూములను ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రానికి రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఎకరం భూమికి ప్రభుత్వం రూ.12 లక్షల చొప్పున పరిహారంగా మంజూరు చేసి నిధులు విడుదల చేసింది. కాగా అలా విడుదల చేసిన మొత్తాన్ని అందరి ఖాతాలలో జమ చేయకుండా నలుగురు పెద్ద మనుషుల ఖాతాల్లో జమ చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. రూ.50.40 లక్షలను నలుగురి ఖాతాల్లో జమ చేయడంలో ఉద్దేశం ఏమిటని వాగ్వివాదానికి దిగారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని అన్నారు.